తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# అక్రమ కేసుల నుంచి విముక్తి కల్పించండి

**-సిఎంకు టిడిపి నాయకుల వినతి**



పుత్తూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా వైసిపి ప్రభుత్వ హయాంలో తమపై పెట్టిన కేసుల నుంచి విముక్తి లభించలేదని పలువురు టిడిపి నాయకులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఏ నేరం చేయకపోయినా కేసుల్లో కూరుకుపోయి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ప్రజల కోసం చేసిన పోరాటాలకు కేసులు పెట్టుకుని పోలీస్‌స్టేషన్, కోర్టు చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సి వస్తోందని వాపోయారు. ముఖ్యంగా పుత్తూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను గత వైసిపి ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయకుండాగాలికి వదిలేసింది. ఈ నేపథ్యంలో 2020వ సంవత్సరంలో మునిసిపాలిటీ పరిధిలోని వినాయకపురం వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్దిదారులైన పేదలకు ఇవ్వాలని పలువురు టిడిపి నాయకులు శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. అయినప్పటికీ అప్పటి వైసిపి ప్రభుత్వం వారిపై అక్రమ కేసులు బనాయించింది. ఆ కేసులకు సంబంధించి గత ప్రభుత్వంలో అయిదేళ్ల పాటు నాయకులు కోర్టు చుట్టూ తిరిగారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేసుల నుంచి బయటపడతామని నాయకులు సంబరపడ్డారు. ఎన్నికల ముందు పార్టీ కోసం పోరాడిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామని చెప్పినప్పటికీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా పెద్దగా పట్టించుకోకపోవడంపై పార్టీ క్యాడర్ తీవ్ర నిరుత్సాహానికి గురవుతోంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల నుంచి నాయకులను రక్షించి, విముక్తి చేయాలని కేసుల వల్ల ఇబ్బంది పడుతున్న పలువురు టిడిపి నాయకులు పత్రికాముఖంగా విజ్ఞప్తి చేశారు. వినతి చేసిన వారిలో పార్టీ పట్టణ, రూరల్ విభాగాల అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, అరవ బాలాజీ, మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఎం.ఎస్. కరుణాకరన్, నందిమంగళం బాబునాయుడు, ఆనంగి రమేష్, మణి రెడ్డి, అన్భళగన్, పార్థిబన్ తదితరులున్నారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కమిటీగా పలమనేరు

**-పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**



నూతన పాలకమండలితో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త: పలమనేరు మార్కెట్ కమిటీని త్వరలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కమిటీగా మార్పు చేస్తామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం వైభవంగా నిర్వహించారు. చైర్మన్‌గా రాజన్న, వైస్ చైర్మన్‌గా దిలీప్‌కుమార్, డైరెక్టర్లుగా శ్రావణి, హేమలత, వెంకట రమణ, జయమ్మ, శాంతమ్మ, ప్రియ, చంద్ర మోహన్, సోమశేఖర్,మునిరత్నమ్మ, రఘు, రెడ్డెప్ప, నదీమ్, వెంకటరమణారెడ్డి, రుద్రమూర్తిచే ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవయ్య ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు సకాలంలో మార్కెటింగ్ సదుపాయం అవసరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి మార్కెట్ కమిటీలో చేపట్టాల్సిన అభివృద్ధికి పనులకు తగిన నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఎన్నో పాలకమండళ్ళు పనిచేసినా చేయాల్సిన అభివృద్ధి పనులు ఇంకా మిగిలి ఉన్నాయని వివరించారు. నూతనంగా ఏర్పాటైన పాలకమండలి తమ పదవీ కాలంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి సత్తా నిరూపించుకోవాలన్నారు. అంతకు ముందు భారీఎత్తున ఎంబిటి రోడ్డులో ర్యాలీగా వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర హస్త కళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జిల్లా తెలుగదేశం పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్, మార్కెట్ కమిటీ పరిధిలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి మండలాలకు చెందిన తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీవారిమెట్టు మార్గంలో చిరుతపులి కలకలం

**-150వ మెట్టు వద్ద భక్తుల హాహాకారాలు**



చంద్రగిరి, అక్టోబర్ 31 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురం శ్రీవారిమెట్టు మార్గంలో 150వ మెట్టు వద్ద చిరుతపులి కనబడటంతో భక్తులు భయాందోళనతో హాహాకారాలు చేశారు. తిరుపతి పరిసరాలలో చిరుతపులులు తరచూ ఏదో ఒక ప్రదేశంలో కనబడుతూ ప్రజలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. శుక్రవారం శ్రీవారిమెట్టు మార్గంలో మరోసారి చిరుత సంచారం భక్తుల్లో కలకలాన్ని సృష్టించింది. భక్తులు కేకలు వేయడంతో భయపడిన చిరుత అడవిలోకి పారిపోయింది. సమాచారం అందుకున్న టిటిడి అటవీశాఖ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. శ్రీవారి భక్తులను గుంపులు గుంపులుగా చేసి పంపించారు. పులి సంచారం నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రత్యేక ట్రాప్ కెమెరాలు ఏర్పాటు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గతంలో జూన్, సెప్టెంబర్ నెలల్లో చిరుతల సంచారంతో శ్రీవారిమెట్టు మార్గంలో భక్తులను అనుమతించడం నిలిపివేశారు. ఇకపై కొద్దికాలం శ్రీవారిమెట్టు మార్గం సాయంత్రం 6 గంటల భక్తులను అనుమతించని పరిస్థితి ఏర్పడింది. చిరుత సంచారం నేపథ్యంలో టిటిడి యంత్రాంగం భక్తులను తగిన సూచనలిస్తూ పంపుతున్నారు.

# వీడిన ఉత్కంఠత

**- మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్య కేసులో ఐదు మందికి ఉరిశిక్ష - బాధిత కుటుంబాలకు రూ.70 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశం - అపద్దపు సాక్ష్యాలు చెప్పిన వారిపై కఠిన చర్యలు - 59 మంది సాక్ష్యులను విచారించిన కోర్టు - ఉరిశిక్ష పడ్డ ఐదు మందిని కడప జైలుకు తరలింపు - ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత వాఖ్యలు**

చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త: చిత్తూరు దివంగత మేయర్ కఠారి హేమలత, ఆమె భర్త కఠారి మోహన్ హత్య కేసులో నిందితులైన ఐదు మందికి ఉరిశిక్ష విధిస్తూ చిత్తూరు 9వ అదనపు జిల్లా జడ్జి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. మేయర్ దంపతుల హత్య కేసులో ప్రధాన నిందితులుగా కోర్టు నిర్ధారించబడిన శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతి అలియాస్ ముల్బాగల్ వెంకటేష్, జయప్రకాష్‌రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లకు ఉరిశిక్ష విధిస్తూ జడ్జి శ్రీనివాసరావు తీర్పు ఇచ్చారు. ఉరిశిక్ష విధించడిన వారిని కడప సెంట్రల్ జైలుకు తరలించాలని జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఈ కేసులో బాధిత కుటుంబాలకు రూ.70 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఇందులో మేయర్ కఠారి అనురాధ కుటుంబసభ్యులకు రూ.50 లక్షలు, ఈ కేసు ఫిర్యాదుదారుడు సతీష్‌నాయుడుకు రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అలాగే ఈ కేసు నేర విచారణ సమయంలో కేసును త్రప్పుడు ద్రోవ పట్టించడానికి అపద్దపు సాక్ష్యాలు చెప్పిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 2015 నవంబర్ 17వ తేదీ ఉదయం 11.45 గంటలకు అప్పటి మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లు దారుణ హత్యకు గురయ్యారు. మేయర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో మేయర్ కార్యాలయంలోనే మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లు దారుణంగా హత్యకు గురి కావడం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ మేరకు చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఈ కేసులో శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతి అలియాస్ ముల్బాగల్ వెంకటేష్, జయప్రకాష్‌రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లు, మురుగన్, వెంకటయోగనందం, పరంధామలతో సహా 23 మంది నిందితులుగా తేల్చి వీరిపై కేసు నమోదు చేసి 2016 ఫిబ్రవరి 18వ తేదీన చార్జ్‌షీటు దాఖలు చేశారు. 2015 నవంబర్ 17వ తేదీ ఉదయం ఈ కేసులో ప్రధాన నిందితుడు చంద్రశేఖర్ అలియాస్ చింటూ కార్యాలయంలో చింటూతో పాటు వెంకటాచలపతి అలియాస్ ముల్బాగల్ వెంకటేష్, జయప్రకాష్‌రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్, మురుగన్, పరంధామలు సమావేశమై మేయర్ దంపతుల హత్యకు ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్లాన్ ప్రకారం మురుగన్ ఉదయం 11.05 గంటలకు మున్సిపల్ కార్యాలయం చేరుకుని చంద్రశేఖర్ అలియాస్ చింటూకు ఫోన్ చేసి మేయర్ ఛాంబర్‌లో మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లు వున్నారని సమాచారం అందజేశాడు. ఆపై చంద్రశేఖర్, వెంకటాచలపతిలు తమ కదలికలను ఎవరు గుర్తుపట్టకుండా వుండటానికి ముస్లిం మహిళలు ధరించే నల్లటి బురఖాలను ధరించి వచ్చారు. చంద్రశేఖర్ ఒక లేడీస్ హ్యాండ్ బ్యాగు బురఖాలో వస్తే వెంకటాచలపతి కూరగాయలు, కరివేపాకు వేసుకుని ఒక బ్యాగు పట్టుకుని పిటీషనర్లతో వచ్చి కలసిపోయారు. వీరికి కొంత దూరంలో వుండి జయప్రకాష్‌రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లు వీరిని అనుసరిస్తూ వచ్చారు. మురుగన్ మాత్రం కార్యాలయం వెలుపల కారులో అప్రమత్తంగా వుండి ఎదైనా అత్యవసర పరిస్థితి వస్తే నిందితులను తప్పించడానికి కారుతో సిద్ధంగా వున్నాడు. మేయర్ కఠారి అనురాధ చాంబర్ దగ్గరకు వెళ్తున్న సమయంలో వెంకటాచలపతి తన వద్ద వున్న స్టిక్ బ్యాగ్ నుండి మూడు వేట కొడవళ్ళు తీసి జయప్రకాష్‌రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లకు అందజేశాడు. అలాగే చంద్రశేఖర్ అలియాస్ తన వద్ద వున్న పిస్టల్‌ను వెంకటాచలపతికి ఇచ్చాడు. ఆపై చంద్రశేఖర్, వెంకటాచలపతిలు ఇద్దరు కలిసి మేయర్ గదివైపుకు వెళ్ళారు. మేయర్ గదిలోకి ప్రవేశించిన వెంటనే అక్కడే వున్న కఠారి మోహన్ బావమరిది కిషోర్ బురఖాలో వున్న వారిని అనుమానంగా చూస్తూ ఎవరు మీరు అని ప్రశ్నించగా చంద్రశేఖర్ తన ముఖంగా వున్న బురఖాను తొలగించి కిషోర్‌ని తోసివేసి మేయర్ గదివైపు దూసుకెళ్ళాడు. మేయర్ గదిలో మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లు చర్చించుకుంటుండగా చంద్రశేఖర్ తన వద్ద వున్న పిస్టల్‌తో మేయర్ కఠారి అనురాధ తలకు గురిపెట్టి కాల్పులు జరిపాడు. మేయర్ కఠారి అనురాధ అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఆపై చంద్రశేఖర్, వెంకటాచలపతిలో కఠారి మోహన్‌పై దాడికి ప్రయత్నించగా అక్కడే వున్న ఫిర్యాదిదారుడు సతీష్ కఠారి మోహన్‌ను రక్షించడానికి ప్రయత్నించగా తోటి మంజునాథ్ అతని వీపును గొడ్డలితో నరికాడు. ఆ సమయంలో వెంకటాచలపతి కఠారి మోహన్‌పై ఎయిర్ పిస్టల్‌తో కాల్పులు జరుపగా కఠారి మోహన్ ప్రాణభయంతో తప్పించుకోవడానికి కౌన్సిల్ హాలువైపుకు పరిగెత్తాడు. కఠారి మోహన్‌ను చంశ్రేఖర్, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లు వేటకొడవళ్ళతో వెంబడించి కౌన్సిల్‌హాలులోనే దాడి చేశారు. ఈ దాడిలో కఠారి మోహన్‌కు మెడపై తీవ్ర గాయమై అక్కడే కుప్పకూలిపోయాడు. ఆపై ముందు సిద్ధం చేసుకున్న ప్లాన్ ప్రకారం కార్యాలయం వెలుపల వున్న కారులో ఐదు మంది అక్కడి నుండి పారిపోయారు. ఈ ఘటనలో మేయర్ కఠారి అనురాధ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, కఠారి మోహన్‌ను చికిత్స నిమిత్తం వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించగా ఆయన అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అప్పటి ఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు చిత్తూరు డిఎస్పీ లక్ష్మీనాయుడు ఆధ్వర్యంలో విచారణ ప్రారంభమైంది. ఈ కేసులో 69 మంది వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేసి నిందితులు హత్యకు ఉపయోగించిన అన్ని వస్తువులను సీజ్ చేశారు. ఈ క్రమంలో 2015 నవంబర్ 30న ఈ కేసులో ప్రధాన నిందితుడు చంద్రశేఖర్ అలియాస్ చింటూ చిత్తూరు 4వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోయాడు. ఈ కేసు సుధీర్ఘ విచారణలో పోలీసులు 59 మంది సాక్షులను విచారించారు. ఈ మేరకు కేసు పూర్వ పరాలను సుదీర్ఘంగా పరిశీలించిన 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాసరావు ఈ కేసుకు సంబంధించి ఐదు మంది నిందితులకు ఉరిశిక్ష వేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. పదేళ్ళ పాటు ఈ కేసులో న్యాయం కోసం నిరీక్షించడం జరిగిందని, న్యాయం గెలిచిందని దివంగత మేయర్ కఠారి అనురాధ కోడలు ప్రస్తుత చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత వాఖ్యలు చేశారు.



హత్యకు గురైన మేయర్ దంపతులు(ఫైల్‌ఫోటో)



హత్య కేసులో ఉరిశిక్ష పడిన నిందితులు

**హైకోర్టుకు అప్పీలు!**

మేయర్ దంపతుల హత్య కేసులో ఉరిశిక్ష పడ్డ ఐదు మంది నిందితులు హైకోర్టుకు అప్పీలుకు వెళ్ళే అవకాశాలు కన్పిస్తున్నాయి. జిల్లా కోర్టులో ఉరిశిక్ష విధించిన ఐదు మంది హైకోర్టును ఆశ్రయిస్తే వారికి కొంత ఉపశమనం జరిగే అవకాశం వుంది. ఈ మేరకు నిందితుల తరపున న్యాయవాది హైకోర్టు అడ్వకేట్ విజయచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లా కోర్టు విధించిన మరణ శిక్ష నిర్ధారణకు హైకోర్టుకు పంపుతారన్నారు. ఒకవేళ నిందితులు హైకోర్టులో అప్పీలు చేస్తే మరణ శిక్ష రద్దు అయ్యే అవకాశాలు ఎక్కువగా వున్నాయన్నారు. నిందితులు 90 రోజుల్లోపు హైకోర్టును ఆశ్రయించాలని, అయితే తాము జిల్లా కోర్టు జడ్జిమెంటు కాపీలు అందిన వెంటనే హైకోర్టులో అప్పీలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# వడ్డీకాసులవాడికే శఠగోపం!

**-కొనుగోళ్ళలో అవినీతి పాపం ఎవరిదీ!**

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:



వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి ఆదాయానికి గండికోట్టి భారీ మొత్తంలో కొనుగోళ్ళలో అక్రమాలు జరిగాయనే విషయం వెలుగుచూడటంతో దేవుని సొమ్ముకే శఠగోపం పెట్టిన ఘనులెవరనేది ఇప్పుడు భక్తుల్లోనూ సంచలన చర్చనీయాంశంగా మారింది. అవినీతికి పాల్పడిన గత ధర్మకర్తలమండలిలో పెద్దలెవరు? పాలుపంచుకున్న అధికారులెవరనేది ఇప్పుడు టిటిడి వర్గాల్లోనూ కలవరపెడుతోంది. సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి వడ్డీకాసులవాడిగా భక్తుల నుండి మొక్కుబడులు వసూలుచేస్తాడనే విశ్వాసం వుంది. అయితే ఆయన ఖజానాకే ఏకంగా దోపిడీ చేసిన భోక్తలు మాత్రం ఎంతటివారనేది ఇప్పుడు తేల్చాల్సిన అంశం. ప్రముఖులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన సందర్భంలో వారికి మర్యాదపూర్వక స్వాగతం పలికి పుష్పగుచ్చాలు, దుశ్శాలువలతో సన్మానించడం పరిపాటి. ఈ శాలువలు ఖరీదు మార్కెట్లో నాణ్యమైనవి కూడా 300-350 రూపాయలు లోపే ఉంటుంది. అయితే ఈ శాలువలను గత టిటిడి బోర్డులోని పెద్దలు, ప్రొక్యూర్‌మెంట్‌సెల్ కమిటీలోని అధికారులు ఏకంగా నాలుగురెట్లు పెంచి 1,300రూపాయలు వెచ్చించి కొనుగోలుచేశారనేది తాజాగా తేలిన విషయం. ఇలా గత ఐదేళ్ళలో ఏటా కోట్లరూపాయల్లో అవినీతికి పాల్పడ్డారనేది ప్రస్తుతం టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అధికారులు వెల్లడించిన సమాచారం. ఇదేగాక ఇంకా టిటిడి అవసరాలకు, తిరుమలలో నైవేద్యాలు తయారీ, లడ్డూప్రసాదాల తయారీకి అవసరమైన ముడిసరుకులు భారీ మొత్తంలో నాణ్యత ఉన్నవి కూడా టెండర్‌ద్వారా కొనుగోలుచేస్తారు. ఈ టెండర్లలో ఏమేరకు వ్యాపారులతో ధరలు ఖరారుచేశారనే అంశంపై కూడా ఆరాతీస్తున్నారు. టిటిడి కొనుగోలు విభాగంలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయని, దీనిపై అవినీతి నిరోధకశాఖ(ఏసిబి)తో సమగ్ర విచారణ జరపాలని ఇటీవల బోర్డు నిర్ణయం తీసుకోవడం సంచలనమే. మరీ ధార్మికసంస్థ టిటిడిలో అక్రమాలు, అవినీతిని కనిపెట్టి దేవుని సొమ్ముదుబారా కాకుండా చూడాల్సిన బాధ్యత నిఘాభద్రత విభాగంపై కూడా ఉంది. భారీమొత్తంలో కొనుగోళ్ళలో అవినీతికి పాల్పడేలా ప్రోత్సహించిందెవరనేది కూడా ఇప్పుడు ఏసిబి విచారణలో వెల్లడికానుంది.

**-శాలువల కొనుగోళ్ళనుండే అవినీతి వెలుగులోకి:**

శ్రీవేంకటేశ్వరస్వామికి ఏటా కోట్లాదిమంది భక్తులు తమ మొక్కుబడుల్లో హుండీకి సమర్పించే పలురకాల కానుకల ద్వారానే ఆదాయం లెక్కిస్తారు. ప్రతి ఏటా టిటిడి వార్షిక బడ్జెట్ కూడా హుండీ ఆదాయంపైనే ఆధారపడి రూపొందించడం ప్రత్యేకత. ఇప్పటికే తిరుమలలో ప్రస్తుత టిటిడి బోర్డు ఖర్చులు తగ్గింపుకు మార్గాలతో ఆదాయం సముపార్జనపైనే ప్రత్యేక దృష్టిసారించింది. ఖజానాకే నష్టం వాటిల్లేలా శాలువలతోనే అవినీతిని గుర్తించిన ప్రస్తుత బోర్డు ఇంకెలాంటి కొనుగోళ్ళలో భారీ అక్రమాలు జరిగాయనేది ఏసిబి తేల్చాల్సిన విషయం.

# అన్నదాత సుఖీభవ పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 31 ప్రభాతవార్త : అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతుల నుండి అంది తహశీల్దార్ లాగిన్‌లలో ఉన్న వెబ్ ల్యాండ్ కరెక్షన్ పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం మద్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరం నందు అన్నదాత సుఖీభవ పథకంకు సంబందించి వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ పెండింగ్ ప్రక్రియపై డిఆర్‌ఓ నరసింహులు తో కలిసి ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, వి.ఆర్.ఓ. లు, వి.ఎ.ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు అంది ప్రస్తుతం తహశీల్దార్ లాగిన్ నందు పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతుల ఈకేవైసి పెండింగ్, ఆదార్ నెంబర్ బ్యాంకు ఖాతులకు లింక్ కాక పోవడం, మ్యుటేషన్, రాంగ్ ఆధార వంటి సమస్యలు వలన జిల్లాలో ఇప్పటివరకు 57,096 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఈ పెండింగ్ వల్ల అర్హత కలిగిన రైతులకు నగదు జమ కాలేదని తెలిపారు. తాసిల్దార్ లాగిన్ లో వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ చేయాల్సి ఉంటుందని ఈ ప్రక్రియ రైతులు ఉచితంగా కరెక్షన్స్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ విషయంపై వీఆర్వోలు, విఏవోలు రైతులందరికీ పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం రెండవ విడత నవంబర్ మాసంలో, మూడవ విడత జనవరి మాసంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు జమ చేయనున్నదని అర్హత గల రైతులను గుర్తించి లబ్ది పొందేలా సంబందిత వ్యవసాయ అధికారులు చూడాలన్నారు. పెండింగ్ ప్రక్రియ పూర్తయితే ప్రతి రైతుకు నగదు జమ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.ఎక్కువ శాతం దరఖాస్తులు పెండింగ్ ఉన్న మండలాలలో సంబందిత మండలాల తహశీల్దార్లు, వి.ఆర్.ఓ. లు, వి.ఎ.ఓ. లు పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను వారం లోపు పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ పై ఆర్‌డిఓ లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ సంబంధించి వి.ఆర్.ఓ. లాగిన్ ప్రక్రియను పూర్తిచేయాలనీ తెలిపారు. ఈ పంట కు సంబందించిన సూపర్ చెక్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఎపి ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయితే పి.ఎం. కిసాన్ నగదు రైతుల ఖాతాలలో జమ అవ్వుందని సంబందిత వ్యవసాయ అధికారులు జిల్లాలోని రైతులందరినీ రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్రావు, సహాయ వ్యవసాయ అధికారి ధనంజయరెడ్డి, జిల్లా కో ఆపరేటివ్ అధికారినీ నాగవర్ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడిలో... వృద్ధుడిపై కేసు నమోదు!



గూడూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త: గూడూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో 8 ఏళ్ళ బాలిక పై 50 ఏళ్ల వృద్ధుడు హత్యాచార యత్నం ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. హాస్పిటల్‌లో పెంచలయ్య అనే వ్యక్తి చికిత్స చికిత్స నిమిత్తం హాస్పిటల్‌లో ఉండగా అతని దగ్గర ఉన్న కుమార్తె పై అదే వార్డులో మరో పేషంట్ అటెండర్‌గా ఉన్న జమీర్ అనే వృద్ధుడు అత్యాచారం యత్నానికి పాల్పడినట్లు వచ్చిన రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేశామని వెల్లడించారు. నిందితుడుపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పి మనోహర్ ఆచారి, డిఎస్పీ గీత కుమారి, సిఐ శేఖర్ బాబు, సిబ్బంది ఉన్నారు.

## వెంకటగిరి డివిజన్ చేయడమే టిడిపి లక్ష్యం : ఎమ్మెల్యే



వెంకటగిరి, అక్టోబర్ 31 ప్రభాతవార్త: వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. జిల్లాల పునర్విభజన సమయంలో, వెంకటగిరి ప్రాంత ప్రజల కోరిక మేరకు, మా నాయకులు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, రెవిన్యూ, ఇంచార్జ్ మినిస్టర్ అయిన అనగాని సత్య ప్రసాద్‌ని కలిసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయవలసిందిగా కోరినట్లు తెలిపారు. వారికి వినతి, అవసరాలు కూడా ఇచ్చినట్లు తెలిపారు. వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయాలనేది టీడీపీ అజెండాలో మొదటి నుండి ఉన్న విషయం అన్నారు. ఇది ప్రజల కోసం మేము నిలబడిన ఉన్నట్లు చెప్పారు. ఇప్పుడు కొత్తగా వైసిపి నాయకులు చెప్పవలసినది ఏమీ లేదని స్పష్టం చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు మెరుగైన పరిపాలన మరియు సేవలు అందించడానికి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అత్యవసరం అన్నారు. దీని సాధన కోసం మా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోరికలను నెరవేర్చడానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

**ఆర్థిక సంక్షోభంలో మున్సిపాలిటి...**

# పేరుకు పోతున్న పాత బకాయిలు

**-అభివృద్ధి ప్రశ్నార్థకం- చెల్లింపుల కోసం కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు**



శ్రీకాళహస్తి పట్టణం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 31 ప్రభాతవార్త: ప్రభుత్వం ఏమో చిన్న కాంట్రాక్టర్లకు పాత బకాయిలను చెల్లించాలని ప్రకటనలు చేస్తుంది. అయితే క్షేత్ర స్థాయిలో ఈ ప్రకటన అమలు జరగటం లేదు. ప్రభుత్వం ఈ ప్రకటన చేసి పక్షం రోజులు గడుస్తున్నా ఏ కాంట్రాక్టర్‌కు కూడా బిల్లులు చెల్లింపు జరగలేదు. సిఎంఎఫ్ఎస్ మాయాజాలంలో శ్రీకాళహస్తి మున్సి పాలిటిలో పనులు చేసిన కొత్త పాత కాంట్రాక్టర్లు లబోదిబో అంటున్నారు. తమ బాధలు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియని స్థితి. మున్సిపాలిటి సుమారు రూ.2కోట్లకు పైగా బకాయి ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ప్రకటనలకు ఆచరణకు పొంతన కుదరటం లేదు.

పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి మున్సిపాలిటి స్థాయి పెరిగింది కానీ ఆదాయ వనరులు పెరగలేదు. ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ నిధుల్లేకుండా అభివృద్ధికి ఆమడ దూరంలో కొట్టుమిట్టాడుతుంది. అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్ని సార్లు టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. పనులు చేసిన కాంట్రాక్టర్లు చెల్లింపుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మాధానం చెప్పలేక అధికారులు ముఖం చాటేసే పరిస్థితి చోటు చేసుకుంది.

**పాత బిల్లుల చెల్లింపుల ఊసే లేదు:**

శ్రీకాళహస్తి పురపాలకసంఘంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఏళ్ళ తరబడి చెల్లింపులు చేయక బకాయిలు తడిసి మోపెడయ్యాయి. ఇప్పటి వరకు మున్సిపాలిటి ఎంత బకాయి ఉన్నది తెలలేదు.ఈ చెల్లింపులకు సంబంధించి బిల్లుల చెల్లింపుకు ప్రభుత్వం వద్ద కునుకు తీస్తున్నట్లు సమాచారం. అయితే రాబోవు మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు నిధులు కోరుతుంటే 'సాధారణ నిధుల' నుంచి చేసుకోమని ఉన్నతాధికారుల నుంచి సమాధానం వస్తున్నట్లు సమాచారం.

**దేవస్థానం ఆదుకోవాలి :**

శ్రీకాళహస్తి అభివృద్ధి ఇటు మున్సిపాలిటి అటు దేవస్థానం మీద ఆధారపడి ఉంది. తిరుపతి అభివృద్ధికి ఎలా తిరుమలేశుని నిధులు వెచ్చిస్తున్నారో అలాగే శ్రీకాళహస్తి అభివృద్ధిలో దేవస్థానంను భాగస్వామ్యం చేయాలి. ఎంతో కాలంగా పట్టణాభివృద్ధిలో భాగంగా దేవస్థానం కరెంటు బిల్లులు, నాలుగుమాడావీధులు, రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండు వరకు పర్యవేక్షణ దేవస్థానం తీసుకోవాలని ఖర్చులు భరించాలనే డిమాండ్ ఉంది. గత ప్రభుత్వ హాయాం నుంచి కోరుతున్నారు. అయితే దేవస్థానం గతంలో చెల్లిస్తున్న కార్‌పార్కింగ్ వాటా కూడా ఇవ్వటం లేదు. ఇక అభివృద్ధికి సంబంధించి నాయకుడు స్థానిక అధికారులపై ఒత్తిడి తీసుకురావటం కన్నా ప్రభుత్వంతో పోరాడి పుణ్యక్షేత్రానికి నిధులు తీసుకురావాల్సి ఉంది. అభివృద్ధికి సాధారణ నిధులు వాడుకోమంటున్న ఉన్నతాధికారులతో చర్చించాల్సి ఉంది.

# తిరుపతి డివిజన్

## అధికారుల నివేదికలను కథల్లా వింటున్న నాయకులు

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 31 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో



ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో వెంకటరత్నమ్మ, తహసీల్దార్ శ్రీదేవి సమక్షంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలకు ఒక సారి నిర్వహించే సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేసేందుకు చర్చించాలి. కానీ సర్పంచ్‌లుగా ఎంపీటీసీలుగా, ఎంపీపీలుగా, జడ్పీటీసీలుగా ఎన్నుకోబడిన నాయకులు పదవులు అనుభవిస్తూ పదవి కాలం ముగుస్తున్నప్పటికి మండల సర్వసభ్య సమావేశంలో ఒకరిద్దరు నాయకులు తప్ప ఎవరు మాట్లాడడం లేదు. ఇటువంటి సమావేశాలు వలన మండల నిధులు వృతా తప్ప ఉపయోగం ఏమీ లేదు. ఆయా శాఖల వారీగా అధికారులు నివేదికలు చదివి వినిపిస్తుంటే ప్రజా ప్రతినిధులు బుర్రకథ లాగా వింటున్నారు. గ్రామ పరిపాలన అభివృద్ధి కోసం పని చేయని ఈ ప్రజాప్రతినిధులు ఎందుకు...?రిజర్వేషన్ ద్వారా పదవులు పొంది ఆ పదవి విధి విధానాలు తెలియక అలంకారప్రాయంగా అనుభవిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు ఒక విద్యుత్‌శాఖపై స్పందించలేదు. గ్రామ స్వపరిపాలన పరిధిలోని ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిపై ఇకనైనా దృష్టి సారించి తను అలంకరించిన పదవికి సార్థకం చేసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. సమావేశంలో ఆయా ప్రభుత్వ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టేక్వాండోకు రెయిన్ బో విద్యార్థులు

**రేణిగుంట, అక్టోబర్ 31 ప్రభాతవార్త** రేణిగుంట రెయిన్బో



గ్రూప్స్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు పుత్తూరులో జరిగిన జిల్లా స్థాయి టెక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సాయి సింధు, మోహిత్, ప్రదీప్, సుమియా, రువాన్ జిల్లా స్థాయిలో అద్భుతంగా పోటీల్లో ప్రతిభ కనపరచి స్వర్ణ పథకాలను సాధించారు. ఈ నేపథ్యంలో వారంతా రాష్ట్రస్థాయిలో జరిగే అండర్ 17 పోటీలకు అర్హత పొందారు. జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి అర్హత సాధించిన క్రీడాకారులను విద్యాసంస్థల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ షాహేరా భాను, విద్యా సంస్థల బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు.

## ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

**రేణిగుంట, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** రేణిగుంట మండలం జిపాలెం పంచాయితీ కుర్ర కాలవ పద్మా నగర్ జగనన్న కాలనీ, రేణిగుంట పట్టణ భగత్ సింగ్ కాలనీలలో శుక్రవారం ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటియుసి జిల్లా ప్రధాన



కార్యదర్శి కేతారి రాధాకృష్ణ మాట్లాడుతూ ముంబై మహానగరంలో ఏఐటీయూసీ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా ఏర్పడి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఏఐటియుసి మండల కార్యదర్శి కార్తీక్, ఏఐటీయూసీ నాయకులు సెలవా, అమ్ములు, శివగామి, బి. అమ్ములు, మణి, శ్రీను, రవి, నవీన్, అయ్యప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కొత్త ఆశా కిరణం...సమిష్టి సహకార సంఘం

**తిరుపతిరూరల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** రైతుల ఉత్పత్తులకు మార్కెట్ విలువను పెంచడం, మధ్యవర్తులను తొలగించి రైతులకు నేరుగా లాభాలు చేకూర్చడమే ఈ సహకార




సంఘం లక్ష్యమని ఏపిఎం పత్తిపాటి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తిరుపతిరూరల్ మండల మహిళా సమాఖ్య నందు మహిళా రైతులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో రైతుల ఆర్థికాభివృద్ధికి దిశానిర్దేశకంగా మరో కొత్త అడుగు పడింది. తిరుపతిరూరల్ మండలంలోని 'సమిష్టి మండల వ్యవసాయ ఉత్పత్తుదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్'ను ఇటీవల అధికారికంగా రిజిష్టర్ చేయబడిందని తెలిపారు. ఈ సహకార సంఘం ద్వారా పంటల ఉత్పత్తి నిలువ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని దశల్లో రైతులకు సాంకేతిక సాయం, ఆర్థిక సహకారం లభించనున్నది. మహిళా రైతుల ఆత్మనిర్భరతకు ఈ సంఘాలు కీలకం కానున్నాయని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను సమిష్టిగా విక్రయిస్తే, ఎక్కువ లాభం సాధించగలరని తెలిపారు. తిరుపతిరూరల్ సంఘం మోడల్‌గా రాష్ట్రంలోని ఇతర మండలాల్లో కూడా ఇటువంటి సంఘాలను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిరూరల్ మండలంలో ఏర్పడిన 'సమిష్టి రైతు సహకార సంఘం' రైతుల ఆర్థిక స్వాలంభనకు కొత్త దారి తీస్తుందనే నమ్మకం కలుగుతుంది. ఈ సమావేశంలో ఎఫ్‌పిఓ అధ్యక్షరాలు జయలక్ష్మీ, మహిళా రైతేలే, సిసిలు రమేష్, ధనంజయ, రవి, చిత్ర తదితరులు హజరయ్యారు.

## పౌర హక్కులు-సమాన సమాజానికి బాటలు

–తిరుపతిరూరల్ తహశీల్థార్ రామాంజుల నాయక్

తిరుపతిరూరల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త: ప్రతి పౌరు డు తన హక్కులను తెలుసుకోవడం ఎంత ముఖ్య




మో..ఇతరుల హక్కులను గౌరవించడం కూడా అంతే ముఖ్యమని తిరుపతిరూరల్ తహశీల్దార్ రామాంజుల నాయక్ తెలిపారు. శుక్రవారం తిరుపతిరూరల్ మండలం కూపుచంద్రపేట గ్రామ పంచాయతీలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్థార్ మాట్లాడుతూ పౌర హక్కులు-సమాన సమాజానికి బాటలు వేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూపుచంద్రపేట గ్రామ సర్పంచ్ పినాకిపాణి (పిపాసి), పంచాయతీ కార్యదర్శి, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా శిల్ప కడియాల

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో రేడియాలజి ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ శిల్ప కడియాల ఇన్‌ఛార్జి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ గా



నియమితులైనట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం డాక్టర్ శిల్ప కడియాలకు నియామక పత్రం అందజేశారు. డాక్టర్ శిల్ప కడియాల నియామకం పట్ల స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్, డీన్ డాక్టర్ అలోక్ సచన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్ల ఇతర విభాగాధిపతులు, డాక్టర్లు అభినందనలు తెలియజేశారు.

## అజాతశత్రువు అరణి

**– అభివృద్దే ఆయన లక్ష్యం –** జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** అజాతశత్రువు అరణి అని, అభివృద్దే ఆయన లక్ష్యమని జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ నందు కార్పొరేషన్ స్థలంపై కన్ను అనే వార్త కథనంపై జనసేన



నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 36వ వార్డు కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం హాజరైనారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేషన్ స్థలంపై కన్ను అనే వార్తాపత్రికలో ఎమ్మెల్యే సన్నిహితుడిగా చెప్పుకునే ఓ వ్యక్తి సదరు స్థలంపై కన్నేసినట్లు పత్రికలో పేర్కొనడం అవాస్థమని, అసలు సదరు స్థలం ఎటువంటి కబ్జాలకు గురికాలేద న్నారు. ఈ స్థలం ఎటువంటి కబ్జాకు గురికాలేదని, గిట్టనివారు దుష్ప్రచారం చేసి గౌరవ శాసనసభ్యు నిపై, కూటమి నాయకులపై నిందలు మోపడం సమంజసం కాదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బెల్లంకొండ సురేష్, ఆముదాల వెంకటేష్, తోట జయంతి, చందన పాల్గొన్నారు.

## పటేల్ ఆశయ సాధనకు కృషి: ఎస్ఐ భక్తవత్సలం

**రామచంద్రాపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎస్ఐ భక్తవత్సలం పిలుపునిచ్చారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని



వెరిటాస్ సైనిక స్కూల్ విద్యార్థులతో కలసి రామచంద్రాపురం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యతా పరుగు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మునిరామిరెడ్డి, రంజిత్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ యుగం ధర్, పిసిలు వెంకటేష్, మహేష్, రాజేష్, బాబు, ధనంజయులు, తదితరులు పాల్గొన్నారు.

## చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి లభినందనల వెల్లువ

**రామచంద్రాపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి అభినందనల వెల్లువ కొనసాగుతున్నది. శుక్రవారం వైసిపి మండల అధ్యక్షుడు యద్దల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు భానుకుమార్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, ఇరగం రెడ్డి, చిరంజీవులు నాయుడు, కేశవులు రెడ్డి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయి పదవి లభించడంపట్లతుమ్మలగుంటలోనిఆయన నివాసంలో గజమాలతో ఘన సత్కారం గావించి, అభినందనలు తెలిపారు.

## సాంస్కృతిక పోటీలకు దరఖాస్తు చేసుకోండి

**తిరుపతి క్రీడ, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** శ్రీ వివేకానంద స్వామి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయ యువజనోత్సవాలు, రాష్ట్ర స్థాయిలో యువజనోత్సవాలలో పాల్గొనేందుకు సెట్విన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో యువ కళాకారులకు ఈ నెల 4వ తేది ఎమ్రాల్డ్స్ డిగ్రీ, పిజి కళాశాల, నరసింహ తీర్థకట్టు వీధి తిరుపతిలో సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సెట్విన్ నిర్వాహకులు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగి యువతీ యువకులు ఈ నెల 27వ తేదిలోగా తమ పేరు, పుట్టిన తేది, పోటీలో పాల్గొనే అంశంను 8341111687 వాట్సాఫ్ నెంబర్‌కు కానీ, సెట్విన్ కార్యాలయం తిరుపతి నందుఅందజేసారు.మరిన్నివివరాలకు0877-2286921,8341111687నెంబర్‌కుసంప్రదించాలన్నారు.

## సమన్వయం లేని సంసారాల్లో సుఖమెలా ఉంటుంది?



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 31 ప్రభాతవార్త :** సమన్వయం లేని సంసారాల్లో సుఖమెలా? ఉంటుందని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు.శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత సమాజంలో నేడు కుటుంబాల్లో 'సుఖం లేదని' కుములుతున్నామని ఇందుకు కారణాలు తెలుసుకోకుండా వాపోతున్నామన్నారు. మనం మహమ్మద్ ప్రవక్త జీవన విధానాన్ని అధ్యయనం చేస్తే కుటుంబంతో ఎలా నడచుకోవాలనే అంశం అవగాహన వస్తుందన్నారు. ప్రవక్త ఇంటిలోకి ప్రవేశిస్తేనే 'సలాం చేస్తూ' ప్రవేశించే వారన్నారు. ఇక ఇంటిలో అందరితో నవ్వుతూ మాట్లాడేవారని కోపం ఏ మాత్రం ప్రదర్శించే వారు కాదన్నారు. నేడు మనం ఎలా నడుచుకుంటున్నామో? ఆత్మపరిశీలన చేసు కోవాలన్నారు. ప్రవక్త జీవితాన్ని అధ్యయనం చేస్తే మనం కుటుంబాన్ని ఎలా స్వర్గ ధామం చేసుకోవాలో తెలుస్తుందన్నారు. నమస్కారం(సలాం)అనేది సంస్కారానికి నిదర్శనం అన్నారు.

## సాంబయ్యపాలెంలో ఉక్కుమనిషి జయంతి

**తొట్టంబేడు,అక్టోబర్ 31 ప్రభాతవార్త:** మండలంలోని దిగువ సాంబయ్యపాళెం పాఠశాలలో శుక్రవారం ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.జాతీయ దినోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం సారధ్యంలో పాఠశాల విద్యార్థులచే కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించు కొని పిల్లలచే కేక్ కట్



చేయించి సంబరాలుజరుపుకున్నారు.ఈ కార్యక్రమాల్లో కయ్యూరి బాలసుబ్రమణ్యంతో పాటు అంగన్‌వాడి కార్యకర్త మోహన్‌రాణి, ఆయా మాధవి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి పేరుతో పెనుగొండ



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** ఆంధ్రరాష్ట్రంలోని పెనుగొండ టౌన్‌పేరును వాసవి పెనుగొండగా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుదువాకచర్ల గుర్రప్పశెట్టి, శ్రీకాళహస్తి ఆర్యవైశ్య సంఘ యువత హర్షం వ్యక్తం చేసారు. ఆర్యవైశ్యుల పట్ల ప్రభుత్వ గుర్తింపుకు నిదర్శనం అన్నారు.కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవుల్లో కూడా అవకాశం కల్పించటం అభినందనీయం అన్నారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరి అమ్మవారికి గౌరవ సూచకంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సబిత ప్రకటించటం గమనించదగ్గ విషయం అని గుర్రప్పశెట్టి అన్నారు.

## ఆర్అండ్‌బి రోడ్లకు నష్టం...వ్యవసాయానికి కష్టం

**తొట్టంబేడు,అక్టోబర్ 31 ప్రభాతవార్త:** మండలంలో ఇటీవల ముంథా తుఫాను తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని ఆర్అండ్‌బి రోడ్లు,పంచాయతీ రోడ్లు దెబ్బతిన్నాయని వ్యవసాయానికి కష్టం ఏర్పడిందని పశుసంపద దెబ్బతిన్నదని అధికారులు సమీక్షించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశంహాలులో మండల ప్రత్యేకాధికారి చిన్న రెడ్డయ్య మండలంలోని



వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఎంపిడిఓ సురేంద్ర నాద్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ కంచనపల్లి దళిత వాడ దగ్గర ఆర్అండ్‌బికి సంబందించిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు.అంతేకాక బంగారు కాలనీ వద్ద ఎక్కడ రోడ్డు ఉందో తెలియని స్థితి చోటు చేసుకుందన్నారు. వీటిని వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. కాగా పశుసంపద దెబ్బతిన్నదని గొర్రెలు,మేకలు చనిపోయాయని వివరించారు. సమావేశంలో ఎంపిడిఓ సురేంద్రనాథ్,తహశీల్దార్ భారతి, డెప్యూటి ఎంపిడిఓ గిరిధర్‌తో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెంచులక్ష్మీకాలనీలో వైద్యశిబిరం

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 31 ప్రభాతవార్త:** పట్టణ శివారుల్లోని చెంచులక్ష్మీ కాలనీలో శుక్రవారం ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ స్టెప్స్ సారధ్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 25సంవత్సరాలుగా స్టెప్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతిఫలం ఆశించక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ప్రమీలమ్మ వైద్యసేవలందిస్తున్నారు. ఇటీవల జరిగిన తుఫానుతో కాలనీల్లో




నిరుపేదలు వైద్యసదుపాయాల కోసం ఎందురు చూస్తున్నారు.ఈ నేపధ్యంలో శుక్రవారం డాక్టర్ ప్రమీలమ్మ చెంచులక్ష్మీ కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ ప్రమీలమ్మతో పాటు మేనేజర్ భాస్కర్, ఎఎన్ఎం మౌనిక, సునీత, కళావతి, కీర్తీ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి ఇత్తడి తొడుగులు వితరణ

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ



ఆలయంలో వెలసిన వినాయకునికి దాతలు ఇత్తడి తొడుగులను వితరణగా అందించారు. ఈ వితరణను ఆలయ డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి అందించారు. శుక్రవారం శ్రీకాళహస్తికి చెందిన అంబూరు రవిబాబు వారి కుటుంబసభ్యు లతో కలసి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డికి అందించారు. ఈ కార్యక్రమాల్లో ఇఓతో పాటు డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, అనుబంధ ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరాలయంలో జబర్దాస్ సద్దాం

**శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 31 ప్రభాతవార్త:** గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరస్వామిని శుక్రవారం బుల్లితెర నటుడు సద్దాం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. వారికి ఆలయ మాజి చైర్మెన్ బత్తల గిరి నాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.వారికి గుడిమల్లంకు చెందిన యువకులు స్వాగతం పలికారు.



## అంధకారంలో చుక్కల నిడిగల్లు

**శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 31 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు నావారాగిరిజన కాలని అంధకారంలో మగ్గుతుంది. చినుకు పడితే నెలల తరబడి ఈ కాలనీలో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. గత 15రోజులుగా ఎడతెరపి లేని వర్షాలతో గిరిజన కాలనీలోని వీధి లైట్లు మూసుకు పోయాయి. వీధి లైట్లు వెలగక చుట్టు చెట్టుచేమలతో విష పురుగులతో ఉంటుందని పొద్దుగుంకితే వీధుల్లో అడుగు పెట్టె పరిస్థితి లేదని వివరించారు.

## నేటి నుంచి శ్రీవారి కార్తీక తెప్పోత్సవాలు

**నారాయణవనం, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని



ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు నేటి నుంచి 5వతేది వరకు 5రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా టిటిడి అధికారులు తామరగుంట పుష్కరిణిని చుట్టు విద్యుత్‌దీపాలు, తోరణాలు, విద్యుత్ కటౌట్లను కట్టారు. నేటి (శనివారం) రాత్రి సీతారామ లక్ష్మణ సమేతంగా గ్రామవీధుల్లో ఊరేగింపుతో పాటు రాత్రి 7గంటలకు తెప్పపై విహరించనున్నారు.

## వైసీపీ నుంచి...వచ్చిన వారికి అగ్రతాంబూలం

సత్యవేడు, అక్టోబరు 31 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజక వర్గంలో రాజకీయ పరిణామాలు రోజు రోజుకు చర్చనీయాంశంగా మారిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేసినప్పటి నుంచి ఆ పార్టీ నాయకుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఏడాదిన్నార కాలంలో అనేక పరిణామాలను చూసిన మండల నాయకత్వానికి ప్రస్తుత పరిస్థితులు వారి ఉనికికే ప్రమాదంగా పరిణమిస్తుంది. ఎన్నికల సమయంలో అంతా తామై మండల ప్రజలకు హామీలు ఇచ్చిన మండల పార్టీ అధ్యక్షుడు, సీనియర్లు నేడు పార్టీకి దూరమయ్యారా...లేక వారి నాయకత్వం అవసరం లేదని ప్రస్తుత పార్టీ ప్రోగ్రాం ఇన్‌చార్జిన పక్కన పెడుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. గురువారం మండలంలోని బాలగోపాలపురం గిరిజన కాలనీ వాసులకు నిత్యావసర సరకులు పంపిణీ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సుందర రామిరెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ మండల అధ్యక్షుడు పరమశివం(బాషా) మరికొందరు సీనియర్ నాయకులు లేకపోవడంతో నిన్నటి వరకు ఉన్న గుసగుసలు నేడు బహిర్గతం అయ్యాయి. పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి వైసీపీ వారిపై దృష్టి పెట్టి పార్టీ వైపు లాక్కున్నారు. దీని వల్ల టీడీపీకి లాభం చేకూరినప్పటికి ఉన్న వారిని పక్కన పెట్టడం అసలు వారికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం చూస్తుంటే పార్టీని పుట్టి ముంచే కార్యక్రమాలు చేపట్టినట్లు అర్థమవుతుందని కొందరు నాయకులు పేర్కొంటున్నారు.

## సెవెన్ హిల్స్‌లో ఘనంగా ఏక్తా దివస్

**రామచంద్రాపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో శుక్రవారం జాతీయ ఏక్తా దివస్ కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన జయంతి రోజు ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, భోదన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## శక్తివంతమైన భారతదేశానికి పునాది



**తిరుపతి, అక్టోబర్ 31ప్రభాతవార్త:** శక్తివంతమైన భారతదేశానికి సర్దార్‌వల్ల భాయిపటేల్ పునాది వేశారని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. పటేల్ జయంతిని తిరుపతిలో బిజెపి నాయకులు శుక్రవారం ఉదయం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కట్టమంచి చంద్రబాబు, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, చంగల్‌రాయలు, అనిల్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, శంభోలు హరినాధ్ పాల్గొన్నారు.

## విజయవంతంగా రన్‌ఫర్ యూనిటీ

**తిరుపతి, అక్టోబర్ 31ప్రభాతవార్త:** సర్దార్‌వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా తిరుపతిలో పోలీసులు రన్ ఫర్ యూనిటీ విజయవంతంగా నిర్వహించారు. పోలీసుమైదానం నుండి ఎంఆర్‌పల్లి కూడలివరకు సాగింది. తిరుపతి ఏఎస్పీలు రవిమనోహరచారి,



నాగభూషణరావు, డిఎస్పీలు శ్రీలత, శ్యామ్‌సుందర్, భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సిఐలు, ఎస్ఐలు, పోలీసులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరా గాంధి వర్ధంతి




**పుత్తూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త :** పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నగరి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ కౌన్సిలర్ సి.కె.కార్తికేయన్ నేతృత్వంలో దేశ మాజీ ప్రధాని భారతరత్న ఇందిరా గాంధి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ప్రధానికి లేనంతగా ఇందిర అంటే ఇండియా, ఇండియా అంటే ఇందిర అనే ఖ్యాతిని ఆమె పొందారని కొనియాడారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, ఉపాధ్యక్షుడు దేశయ్య, పుత్తూరు రూరల్, వడమాలపేట అధ్యక్షులు కేశవులు, పురుషోత్తం రెడ్డి, పార్టీ అనుబంధ కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎ.భాగ్యరాజ్, ఇంకా నాయకులు గూలూరు ఎ.కె.శేఖర్, వేపగుంట గంగాధర్, నందిమంగళం పళణి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐక్యతా స్పూర్తికి నిదర్శనం సర్దార్ వల్లభాయ్ పటేల్

**పుత్తూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త :** భాష, మతం, ప్రాంతం తేడాలు లేకుండా భారతీయులందరినీ ఒకే తాటి పైకి తీసుకువచ్చే దిశగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రజల్లో ఐక్యతా స్పూర్తిని నింపారని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. ఈ సంధ్బంగా కాలేజీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు మనిషిగా




ప్రసిద్ధి చెందిన వల్లభాయ్ పటేల్ స్వాతంత్రం తర్వాత దేశంలోని 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేశారని తెలిపారు. అనంతరం కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య, ఎన్‌సిసి అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ బాబూరావు, అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీనివాసులు, డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ,డాక్టర్‌కె.శ్రీదేవి, డాక్టర్ పి.గాయత్రి, డాక్టర్ గంగయ్య, పిడి సూర్యబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌డిఎచ్‌ఆర్‌లో 310 మందికి ఉద్యోగాలు



**తిరుపతి విద్య, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** తిరుపతి లో ప్రతిష్టాత్మక విద్య సంస్థ ఎస్ డి ఎచ్ ఆర్ డిగ్రీ,పీజీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్లో విద్యార్థులు ప్రతిభ చూపి బహుళజాతి కంపెనీలు అయినా గ్లోలాజిక్ కంపెనీలో 112, ఆల్ సెట్ లో 77, ఎంపసిస్ 22, ఆటో సెన్స్ లో 59 మంది ఉద్యోగాలు సాధించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ ఎస్ డీ హెచ్ ఆర్ విద్యార్థులు ప్రాంగణ ఎంపికలో 310 మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించారని, గ్లో లాజిక్ కంపెనీలో 112 మందికి సంవత్సరంకి 6.2 లక్షల ప్యాకేజ్ సాధించడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ప్రిన్సిపల్ ఉష, అధ్యాపకులతో కలసి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం

**తిరుపతి విద్య, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న నారాయణ ఏ బి పి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నారాయణ విద్యా సంస్థల డిజిఎం కొండలరావు,ఏజిఎం శ్రీనివాసులు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తరగతి గదిలో తాము నేర్చుకున్న విద్య విషయము పరిజ్ఞానాన్ని అభ్యాసన సామాగ్రి ద్వారా విద్యార్థులు చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ వసంత్ కుమార్, కోఆర్డినేటర్ గామత్రి, ప్రిన్సిపాల్ షాహిద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆరని

**తిరుపతివిద్య, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసుల చేతులమీదుగా ద హాఫ్ డే లీవ్ సినిమా పోస్టర్లను బీసీ నాయకులు జగన్నాథం ఆధ్వర్యంలో చిత్ర బృందం సభ్యులతో కలిసి ఆవిష్కచారు. నవంబర్ 9వ తేదీ న రిలీజ్ అవుతున్న ద హాఫ్ డే లీవ్ సినిమాను చూసి వారిని ఆదరించాలని తెలిపారుడైరెక్టర్ కార్తిక్ ఏకక్ష,యాక్టర్ డోన్ గణేష్, సునంద, శ్యాంభోలహరి, రాయచోటి సాయి,బాబ్జి,కృష్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు



## పటేల్ ఉక్కు సంకల్పమే విద్యార్థులకు స్పూర్తి



**తిరుపతి విద్య, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో శుక్రవారం భారత రత్న,భారత తొలి ఉప ప్రధాని,హోం మంత్రి, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని (రాష్ట్రీయ ఏక్తా దివస్) జాతీయ సమైక్యతా దినోత్సవంగా కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. పటేల్ దార్శనికత,ధైర్య సాహసాలు, ఏకీకరణ స్పూర్తి భావితరాలకు స్పూర్తిదాయకమని, ఆయన దేశభక్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసిసిటీవో ఈ.లోకేష్ రెడ్డి,పౌరశాస్త్రఅధ్యాపకుడుడా.సి.ఎల్. చెన్నారెడ్డి, ఎన్‌సిసి క్యాడేట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేతలు అరెస్ట్, 1.5 కేజీ గంజాయి స్వాధీనం

**పుత్తూరు (నగరి), అక్టోబరు 31 ప్రభాతవార్త :** మునిసిపాలిటీ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సిఐ విక్రమ్ శుక్రవారం తెలిపారు. తడుకుపేటకు చెందిన సుమన్ (42), దేవా (22), ఇందిరానగర్‌కు చెందిన తరుణ్ (20)లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 30,000 వేలు విలువైన ఒకటిన్నర కేజీ గంజాయి, రెండు మోటారు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు

## భక్తితో భజనమండళ్ళ మెట్లోత్సవం

**తిరుమల,అక్టోబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతునిపై భక్తిప్రపత్తులతో తిరుమలకొండలను అధిరోహించి, స్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తిచేశారని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. త్రైమాసిక మెట్లోత్సవం శుక్రవారం వేకువజామున అలిపిరి పాదాలమండపం వద్దనుండి మొదలైంది.



## రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు తమిళ విద్యార్థులు

**పుత్తూరు రూరల్, అక్టోబరు 31 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని తమిళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం వాల్మీకిపురం మండలంలో కొత్త మంచూరు ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 బాల బాలికల ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధాన ఉపాధ్యాయురాలు స్వరూప తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం ఆచారి, రమేష్, ప్రభావతి, కస్తూరి, రేవతి ఉదయ పాల్గొన్నారు.



